సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 30 । డిసెంబర్ । 2024



ఇన్‌చార్జ్‌ల ఏలుబడి.. ప్రగతి వెనుకబడి

ఉమ్మడి జిల్లాలో 18 మండలాలకు పాలనాధికారులు లేకపోవడంతో ప్రగతి పనులు ముందుకు సాగడం లేదు. 8లో



టమాట కిలో రూ.8

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.6 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
31.5°/15.9°

జిల్లా పరిధిలో ఆదివారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నిర్వహించనున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖల జిల్లాస్థాయి అధికారులు హాజరవుతారన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా విన్నవించుకోవాలని సూచించారు.

నేడు పోలీస్ కార్యాలయంలో...

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. అర్జీదారులు ఆధార్‌కార్డును తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు. ప్రజలు వివిధ సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

ధాబాలో గంజాయి, హష్కి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, హస్కను చూపుతున్న అధికారులు

చిలమత్తూరు: మండల పరిధిలోని 44వ నంబరు జాతీయ రహదారి కంబాలపల్లి క్రాస్ సమీపంలో గల రాజస్థానీ ధాబాలో 410 గ్రాముల గంజాయి ప్యాకెట్లు, 8.9 కిలోల ఓపియం పాపీ హస్క్ (గసగసాల పొట్టు)ను ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ధాబాలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. 11 ప్యాకెట్ల గంజాయితో పాటు 8.9 కిలోల పాపీ హస్క్ పట్టుబడింది. దీంతో ధాబా నిర్వాహకులు మంగల్‌రామ్, ఇంద్రజిత్, ధన్‌రామ్‌లను అదుపులోకి తీసుకొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అలీబేగ్, ఎస్ఐలు పృథ్వీ, ఫరూక్, వీఆర్‌ఓలు అశ్వర్థనారాయణ, రామాంజిప్ప, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఉన్నతస్థాయికి చేరాలి



నసనకోట పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కృష్ణమోహన్

రామగిరి: విద్యార్థులు ఇష్టంతో చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఏపీ గురుకుల పాఠశాలల రాష్ట్రసెక్రటరీ కృష్ణమోహన్ సూచించారు. ఆదివారం సాయంత్రం పేరూరు డ్యాంలోగల బీసీ బాలుర, నసనకోటలోగల బీసీ బాలికల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించే వసతులను సద్వినియోగం చేసుకుని చదువుతోపాటు ఇతరరంగాల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులకు తెలియజేశారు. త్వరలో జరిగే పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏజీఓ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపాళ్లు సత్యనారాయణ, అమీనాబేగం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

దిగుబడి 'వెలిగి'పోవాలని..



ఎల్ఈడీ బల్బుల కాంతుల్లో చామంతి పంట

పెద్దపప్పూరు: చామంతి పంట సాగులో ఆశించిన దిగుబడి సాధించాలనే లక్ష్యంతో ఓ రైతు పొలంలో ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేయడం ఆకట్టుకుంటోంది. పెద్దపప్పూరు చితంబరస్వామి కాలనీకి చెందిన రైతు సూర్యనారాయణ నాలుగు ఎకరాల్లో చామంతి పూలు సాగు చేస్తున్నాడు. చామంతి మొక్క ఎదుగుదల దశలోనే మొగ్గలు వస్తే ఆశించిన దిగుబడి రాదని పలువురు రైతులు సూర్యనారాయణకు చెప్పారు. పంట చుట్టూ ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేస్తే కాంతి ప్రభావంతో మొగ్గలు రావని తెలిపారు. మొక్క నాటినప్పటి నుంచి 40 రోజులు ఏర్పాటు చేయాలని సూచించారు. దీంతో సూర్యనారాయణ పంట చుట్టూ ఎల్ఈడీ బల్బులను ఏర్పాటు చేశారు. రోడ్డు పక్కనే పొలం ఉండటంతో రాత్రిళ్లు కొత్త అనుభూతి కలుగుతోంది. అటువైపు వెళ్లే వాహనదారులు ఆశ్చర్యంతో చూస్తున్నారు. రైతు ఆలోచన భలేగా ఉందని, దిగుబడి బాగా వచ్చి లాభాలు కూడా మంచిగా రావాలని కోరుకుంటున్నారు.

వ్యవసాయానికి కూలీలేరీ?

గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్న రంగం వ్యవసాయం. బోరు బావులు, వర్షాధారం కింద రైతులు పంటలు సాగు చేస్తున్నారు. అతివృష్టి, అనావృష్టి లాంటి విపత్తులతో నష్టాలు సంభవించినా ఎప్పటికప్పుడు కొంగొత్త ఆశలతో వ్యవసాయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. అలాంటి రైతులకు వ్యవసాయ పనుల్లో తోడుగా నిలుస్తున్నది కూలీలు. యంత్రాలు అందుబాటులోకి వచ్చినా కూలీలకు డిమాండ్ ఏమీ తగ్గలేదు. వారు లేని వ్యవసాయం ఊహించడం కష్టమే.

- ఇతర రంగాలకు మళ్లుతున్న కూలీలు
- గార్మెంట్స్ పరిశ్రమ వైపు మహిళల చూపు
- వ్యవసాయ కూలీలకు పెరుగుతున్న డిమాండ్
- ఉపాధి హామీని అనుసంధానం చేయాలంటున్న రైతులు



పొలంలో ఎరువు చల్లుతున్న కూలీలు



పుట్టపర్తి సమీపాన పొలంలో కలుపు తీస్తున్న వ్యవసాయ కూలీలు

పుట్టపర్తి అర్బన్: వ్యవసాయంలో కూలీల పాత్ర కీలకంగా మారింది. కలుపు తొలగించడం, నాట్లు వేయడం, కూరగాయల కటింగ్, లోడింగ్, గ్రేడింగ్, పొగాకు కూర్చి ఎండబెట్టడం, మొక్కజొన్నకు పాదులు చేయడం, వేరుశనగ చెట్లు తొలగించడం, కాయలు ఏరడం, జొన్నలు భూమిలో పెట్టడం, వరి, మొక్కజొన్నలు ఆరబెట్టడం, మందులు పిచికారీ చేయడం, మామిడి, దోస, కళింగర, బొప్పాయి తదితర పండ్ల కోత తదితర ఎన్నో పనులకు కూలీలు అవసరం. అయితే రానురాను వ్యవసాయ పనులకు వచ్చే కూలీల సంఖ్య తగ్గిపోతోంది. కూలీల్లో కొందరు ఇతర రంగాల్లో పనులకు మళ్లడమే ఇందుకు కారణం. దీంతో వ్యవసాయ సీజన్‌లో కూలీల కోసం రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

స్థిరమైన ఆదాయం కోసం..

గార్మెంట్స్ రంగంలో మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. కూలీల్లో చాలామంది మహిళలు జిల్లాలోని గోరంట్ల మండలం గుంతపల్లి, పుట్టపర్తి మండలం జగరాజుపల్లి, చిలమత్తూరు మండలం మల్లాపల్లి, హిందూపురం, కదిరి, పెనుకొండ, పరిగి తదితర ప్రాంతాల్లోని గార్మెంట్స్ పరిశ్రమల్లో పనులకు వెళ్తున్నారు. వ్యవసాయ పనులతో పోలిస్తే గార్మెంట్స్ పరిశ్రమల్లో పని ఒత్తిడి, ఎనిమిది గంటలపాటు నిల్చుని పనులు చేయాల్సి ఉన్నా, ప్రయాణంలో ఇబ్బందులు ఎదురవుతున్నా సరే గార్మెంట్స్ పనులకే మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయ పనులకు ఎవరు పిలుస్తారా అని ఎదురు చూడకుండా గార్మెంట్స్ పరిశ్రమలో పని చేస్తే ప్రతి నెలా జీతం అందుకోవచ్చన్న ఆలోచనే వారిని ఆ వైపు ఆకర్షిస్తోంది. గార్మెంట్స్ తర్వాత షాపులు, ఫ్యాక్టరీలు, కిరాణా దుకాణాలు, బట్టల షాపులు తదితర చోట్లకూడా పనులకు వెళ్తున్నారు. బ్యాంకు, డ్వాక్రా రుణాలు, చిట్టీపాటలు, పోస్టాఫీసు కంతులు క్రమం తప్పకుండా కట్టాలంటే స్థిరమైన ఆదాయం తప్పనిసరి అవుతోంది.

భవిష్యత్తులో మరింత గడ్డుకాలం

జిల్లాలో 2,44,763 హెక్టార్లలో వ్యవసాయ, 64,359 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. వ్యవసాయ పనులకు ప్రస్తుతం 40 నుంచి 50 ఏళ్లలోపు వయసున్న మహిళలు వస్తున్నారు. ఈ తరం గడిస్తే పొలం పనులు చేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు, మేధావులు అంచనా వేస్తున్నారు. 30 ఏళ్లలోపు మహిళలు కాస్తో కూస్తో చదువుకుని స్వయం ఉపాధి, సులువైన పనులను వెదుక్కుంటున్నారు. దీంతో వ్యవసాయానికి భవిష్యత్తులో గడ్డు పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'ఉపాధి'తోనే వ్యవసాయం మనుగడ

వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకోవాలంటే ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని రైతులు, మేధావులు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా ప్రభుత్వాలు పెడచెవిన పెడుతున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ రంగం కూలీల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. జిల్లాలో అత్యధికంగా వ్యవసాయ కుటుంబాలు ఉన్నాయి. ఉపాధి హామీ పథకం కింద వారితో వ్యవసాయ పనులు చేయిస్తే ప్రతి రైతూ కూలీల సమస్య నుంచి ఉపశమనం పొందుతారు. జిల్లాలో 32 మండలాలు ఉన్నాయి. ఉపాధి హామీ పథకం కింద 2,72,271 జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో ఈ ఏడాది 2.11 లక్షల కుటుంబాలకు పనులు కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే ఇందులో రైతులు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

పొలం పనులపై ఆసక్తి తగ్గుతోంది



రానురాను వ్యవసాయ కూలీల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. పొలం పనులు చేస్తున్న మహిళా కూలీలు మరికొంత కాలానికి కనుమరుగయ్యే పరిస్థితి వచ్చింది. నేటి తరం మహిళలు చిన్న పని అయినా ప్రైవేటు కంపెనీలకు వెళ్తున్నారు తప్ప పొలం పనులకు రావడం లేదు. యంత్రాలు చేయలేని ఎన్నో పనులకు కూలీల అవసరం ఉంటుంది. కూలీలు లేకపోతే వ్యవసాయం చేయలేము. ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడం ఒక్కటే పరిష్కార మార్గం. దీనిపై ప్రతి ఒక్కరూ ఆలోచించాలి.

– నాగభూషణ, పెదపల్లి

శక్తి ఉన్నంత వరకూ చేయగలం



మా ఒంట్లో శక్తి ఉన్నంత వరకు పొలం పనులు చేయగలం. మరో 5, 10 ఏళ్ల దాటితే చాలా కుటుంబాల్లో కూలీల మాటే వినపడదు. ప్రస్తుతం వ్యవసాయ పనుల్లో కూలి గిట్టుబాటు అవుతున్నా పొలం పనులకు రావడం మానేశారు. మాది వ్యవసాయ కుటుంబం కావడంతో నిత్యం పొలం పనులు చేస్తున్నాం. వ్యవసాయాన్ని విడిచి ఉండలేము. ప్రస్తుతం ఉన్న పిల్లలు ఎండకు తట్టుకోలేరు. దీంతో చాలా కుటుంబాల నుంచి గార్మెంట్స్‌కు, కియాలోకి, ఇతర ఫ్యాక్టరీల్లో పనులకు వెళ్తున్నారు.

– లక్ష్మీనరసమ్మ, జగరాజుపల్లి

న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోండి

- ఎస్పీ రత్న సూచన



ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: నూతన సంవత్సర వేడుకలను వివాదాలు, ఘర్షణలకు తావు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ రత్న సూచించారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024కు వీడ్కోలు పలుకుతూ 2025 సంవత్సరానికి స్వాగతం పలికే వేడుకలను పరిమితికి లోబడి చేసుకోవాలని సూచించారు. రోడ్లపై కేక్ కటింగ్ పూర్తిగా నిషేధించామని, డీజే లాంటి భారీ శబ్దాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. హోటళ్లు, మద్యం దుకాణాలు, బార్‌లు, రెస్టారెంట్లు, దుకాణాలు, వ్యాపార సంస్థలు నిర్ణీత సమయానికే మూసేయాలన్నారు. అనుమతి లేని ప్రదేశాల్లో మద్యం సేవించి ఇతరులకు ఇబ్బంది పెడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. 31వ తేదీ సాయంత్రం నుంచి ప్రధాన పట్టణాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక బృందాలతో డ్రంక్ అండ్ డ్రైవ్ కొనసాగిస్తామని తెలిపారు. బైక్ రేసులు, త్రిబుల్ రైడింగ్, మైనర్ల రైడింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మద్యం మత్తులో ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులకు నష్టం చేకూర్చరాదన్నారు. ఈ నెల 31వ తేదీ అర్ధరాత్రి వరకు 30 యాక్ట్ అమల్లో ఉంటుందని, ఎవరైనా హద్దు మీరితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. పిల్లలను నూతన సంవత్సర వేడుకల పేరుతో బయటకు పంపద్దని తల్లిదండ్రులకు సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంట్లోనే నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని కోరారు.

అధిక వడ్డీ ఆశ చూపి.. నిండా ముంచి

- రూ. 5 కోట్ల అప్పు చేసి ఉడాయించిన అన్నాతమ్ముడు
- ఏకంగా 150 మందికి కుచ్చుటోపీ



పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితులు

కళ్యాణదుర్గం రూరల్: అధిక వడ్డీ ఆశ చూపి నిండా ముంచారు ఘరానా అన్నాతమ్ముళ్లు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. వివరాలు.. కళ్యాణదుర్గం మండలంలోని బాల వెంకటాపురం గ్రామానికి చెందిన ఖాసీం వలి, ఇమామ్ వలి అన్నాతమ్ముళ్లు. అదే గ్రామానికి చెందిన దాదాపు 150 మందికి అధిక వడ్డీ ఆశ చూపి రూ.5 కోట్లు అప్పు తీసుకున్నారు. మొదట్లో ఇచ్చిన అప్పును చెప్పినట్లుగానే చెల్లించడంతో చాలా మంది డబ్బు సమర్పించుకున్నారు. ఈ క్రమంలోనే నాలుగు నెలల క్రితం ఖాసీం వలి, ఇమామ్ వలీలు తమ కుటుంబసభ్యులతో కలిసి అనంతపురానికి మకాం మార్చారు. అప్పు ఇచ్చిన వారందరికీ ఐపీ నోటీసులు పంపారు. దీంతో బాధితులు తమకు న్యాయం చేయాలంటూ ఆదివారం కళ్యాణదుర్గంలోని రూరల్ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఇచ్చిన సొమ్ముతో ఖాసీం, ఇమామ్‌లు 2 కేజీల వరకూ బంగారం, అనంతపురంలో ఇళ్లు, ప్లాట్లు కొన్నారని వాపోయారు. అప్పు ఇచ్చిన వారిలో అధిక శాతం రైతులు, గొర్రెల కాపరులు, డ్వాక్రా మహిళలు, కూలీలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులే తమకు న్యాయం చేయాలని కోరారు.

బంగారం అపహరించే ముఠా అరెస్ట్



ముఠా సభ్యుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

గోరంట్ల: బ్యాంకు రుణాలు, పింఛన్లు మంజూరు కోసం ఫొటోలు తీసుకునే పేరుతో అమాయకుల ఒంటిపై ఉన్న బంగారు నగలను చాకచక్యంగా అపహరించుకుపోయే ముగ్గురు సభ్యులు గల ముఠాను గోరంట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం గోరంట్ల స్టేషన్‌లో డీఎస్పీ వెంకటేశ్వర్లు మీడియాకు వెల్లడించారు. లేపాక్షి మండలానికి చెందిన సింహాద్రి, శ్రీహరి, శివ సులువుగా డబ్బు సంపాదించడం కోసం ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరు ఇటీవల గోరంట్ల మండలంలోని పలు గ్రామాల్లో తిరుగుతూ వృద్ధులు, పేద మహిళలను ఎంచుకుని వారికి ప్రైవేట్ బ్యాంకుల్లో రుణాలు ఇప్పిస్తామని, పింఛన్లు మంజూరు చేయిస్తామని నమ్మించారు. ఫొటో కోసం ఇంటి నుంచి బయటకు పిలిపించి.. ఒంటిపై బంగారు ఆభరణాలు ఉంటే లోన్లు, పింఛన్లు రావని చెప్పి.. చైన్లు, కమ్మలు, జుంకీలు తదితర వస్తువులను తీయించి చాకచక్యంగా అపహరించుకుపోయారు. పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆదివారం ముఠా సభ్యులను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 12 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వీరిని పెనుకొండ మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఈ సందర్భంగా ప్రజలకు సూచించారు.

అబ్బేదొడ్డిలో చిరుత సంచారం

గుత్తి రూరల్: మండలంలోని అబ్బేదొడ్డి గ్రామ శివారులో చిరుత సంచరిస్తూ రైతులకు, గ్రామస్తులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై గ్రామానికి చేరుకుంటున్న రైతు దంపతులు... చెరువు వద్దకు నీరు తాగి బయటకు వస్తున్న చిరుతను గమనించి వేగంగా దూసుకెళ్లిపోయారు. అదే రోజు మధ్యాహ్నం ఓ రైతు పొలంలో పనులు చేసుకుంటూ ఉండగా అక్కడికి సమీపంలో నుంచే చిరుత వెళ్లింది. ఈ ఘటనలపై భయభ్రాంతులకు గురైన రైతులు సమాచారం అందిస్తే అటవీ శాఖ అధికారులు స్పందించడం లేదని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిరుతను బంధించేందుకు బోను ఏర్పాటు చేయాలని కోరారు. కాగా, ఆదివారం ఉదయం అటవీశాఖ చిరుద్యోగ ఒకరు గ్రామానికి చేరుకుని చిరుత పాద ముద్రలను గుర్తించాడు.



అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థులు

'కల' నెరవేర్చుకోవాలని..

కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు సమయం దగ్గర పడింది. సోమవారం (నేడు) నుంచి వచ్చే నెల 17 వరకూ అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ప్రక్రియ జరగనుంది. ఈ క్రమంలో కానిస్టేబుల్ అభ్యర్థులు తీవ్రంగా కసరత్తు చేస్తున్నారు. పోటీలో ఎలాగైనా సత్తా చాటాలని శ్రమిస్తున్నారు. దేహదారుఢ్య పరీక్షలకు పురుష అభ్యర్థులు 5,242, మహిళా అభ్యర్థులు 1,237 మంది మొత్తం 6,479 మంది హాజరుకానున్నారు. ఇప్పటికే పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



రన్నింగ్ ప్రాక్టీస్ చేస్తున్న దృశ్యం



పుట్టపర్తి ప్రశాంతి నిలయం సాయికుల్వంత్ హాలులో సత్యసాయి విద్యార్థులు ప్రదర్శించిన 'సా విద్య యా విముక్తయే' నాటికలోని ఘట్టాలు



సత్యసాయి అష్టోత్తర శత నామావళి నిర్వహిస్తున్న రాజస్థాన్ సత్యసాయి భక్తులు

సత్యసాయి సన్నిధిలో రాజస్థాన్ సాంస్కృతిక వైభవం

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తి ప్రశాంతి నిలయానికి విచ్చేసిన రాజస్థాన్ సత్యసాయి భక్తులు సాంస్కృతిక వైభవావం చాటారు. ఆదివారం ఉదయం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సత్యసాయి అష్టోత్తర శత నామావళి నిర్వహించారు. వెయ్యి మంది భక్తులు సామూహికంగా నిర్వహించిన శత నామావళితో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది. సాయంత్రం రాజస్థాన్ సత్యసాయి యూత్ బృందం సత్యసాయి విద్యాసంస్థల ప్రాధాన్యతను, దేశ విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న మార్పులను వివరిస్తూ ప్రదర్శించిన నాటిక అలరించింది.

ఐఆర్ 30 శాతం ప్రకటించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి పీఆర్సీ కమిషన్ వేయడం మరింత ఆలస్యమవుతున్నందున తక్షణమే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని కూటమి ప్రభుత్వాన్ని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్‌టీఏ) నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగిరెడ్డి, శ్రీధర్‌గౌడ్ మాట్లాడారు. 2019లో వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 27 శాతం ఐఆర్ ప్రకటించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆర్నెళ్లవుతున్నా పీఆర్సీ కమిషన్ వేయలేదన్నారు. కనీసం ఐఆర్ కూడా ప్రకటించలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్‌టీఏ నాయకులు వెంకటరమణప్ప, గోవిందరెడ్డి, కృష్ణారెడ్డి, రవీంద్రరెడ్డి, రామకృష్ణ, కృష్ణానాయక్, వెంకటరెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మిస్సింగ్ కేసు నమోదు



కదిరి టౌన్: స్థానిక గఫూర్ సాహెబ్ వీధిలో నివాసముంటున్న లారీ డ్రైవర్ షేక్ సాదిక్ భార్య షేక్ రుబీనా కనిపించడం లేదు. ఈ నెల 23న సాయంత్రం 6 గంటలకు తన పిల్లలతో కలసి రుబీనా బహిర్భూమికి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఇతర గ్రామాల్లో ఉన్న బంధువుల ఇళ్లలో గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో ఆదివారం కదిరి పోలీసులకు భర్త ఫిర్యాదు చేశాడు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. కాగా, 32 ఏళ్లున్న రుబీనాకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరుబాట



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఏపీ టీఎఫ్-1938 నాయకులు

పుట్టపర్తి టౌన్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు సాగిస్తామని ఏపీటీఎఫ్-1938 జిల్లా అధ్యక్షుడు హరిప్రసాదరెడ్డి అన్నారు. ఏపీటీఎఫ్-1938 నేతృత్వంలో ముద్రించిన నూతన సంవత్సర కాలెండర్లను ఆదివారం కొత్తచెరువు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎదుట నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు నాగిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విశ్వనాథ్, రాష్ట్ర మాజీ కార్యదర్శి వెంకటరెడ్డి, నాయకులు శ్రీనివాసులు, వెంకటేష్, శ్రీరామ్‌నాయక్, వినోద్, గోపాలరెడ్డి, రామదాసునాయక్, నర్సిరెడ్డి, అమర్, భాస్కర్, శ్రీనివాసులునాయక్, నారాయణ స్వామి, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో యువకుడి మృతదేహం

పరిగి: మండలంలోని మోదా పంచాయతీ ఎం.చెర్లోపల్లి సమీపంలోని పొలాల్లో ఓ గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని ఆదివారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. దుర్వాసన వస్తుండటంతో రెండు మూడు రోజుల క్రితం మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. 30 నుంచి 32 ఏళ్ల మధ్య వయస్సు ఉంటుంది. ఘటనపై కేసు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రంగడు యాదవ్ తెలిపారు.

ఇన్‌చార్జ్‌ల ఏలుబడి..

ప్రగతి వెనుకబడి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిలో ఎంపీడీఓల పాత్ర కీలకం. అంతటి ప్రాధాన్యత కలిగిన ఎంపీడీఓ పోస్టుల్లో అర్హులు లేక ఇన్‌చార్జ్‌లతో కాలం నెట్టుకొస్తున్నారు. అది కూడా ఏఓలు, ఈఓఆర్డీలకు మండలాల బాధ్యతలు అప్పగించారు. రెండు, మూడు మండలాలు కలిపి ఒకరి చేతిలో పెట్టేశారు. ఫలితంగా కొందరు నియోజకవర్గాలు దాటి ఇతర ప్రాంతాలకు పోవట్లేదు. మరికొందరిపై విపరీతమైన అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇంకొందరు నియంతల్లా వ్యవహరిస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి.

- ఉమ్మడి జిల్లాలో 18 మండలాలకు లేని పాలనాధికారులు
- ఏఓలు, ఈఓఆర్డీలతో నెట్టుకొస్తున్న సర్కారు
- కొన్ని చోట్ల రెండు, మూడు మండలాలకు ఒక్కో ఎంపీడీఓ

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 63 మండలాలు ఉండగా ఒక్కో మండలానికి ఒక్కొక్కరు చొప్పున అంతే సంఖ్యలో ఎంపీడీఓలు కూడా ఉండాలి. అయితే 18 మండలాలకు ఎంపీడీఓలు లేరు. అందులో ఎనిమిది మండలాలకు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లు(ఏఓలు) ఇన్‌చార్జ్ ఎంపీడీఓలుగా వ్యవహరిస్తుండగా, ఐదు మండలాలకు ఈఓఆర్డీలు, మరో ఐదు మండలాలకు పక్క మండలాల ఎంపీడీఓలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అనంతపురం జిల్లా పరిధిలో ఆరు మండలాలకు రెగ్యులర్ ఎంపీడీఓలు లేరు. శ్రీసత్యసాయి జిల్లాలో 12 మండలాలకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓలే దిక్కయ్యారు.

అవినీతి ఆరోపణలున్నా.. అందలం..

ఇన్‌చార్జ్ ఎంపీడీఓలుగా వ్యవహరిస్తున్న 18 మందిలో కొందరిపై వివిధ రకాల అవినీతి ఆరోపణలున్నాయి. అయినా వారికే ఎంపీడీఓలుగా పెత్తనం కట్టబెట్టారు. కొందరు ఏళ్ల తరబడి ఒకే నియోజకవర్గంలో తిష్ట వేసిన వారూ ఉన్నారు. వీరు గ్రామాల అభివృద్ధి కంటే అక్రమ సంపాదనపై మోజు కనబరుస్తున్నారనే ఆరోపణలున్నాయి.



అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయం

కానరాని అభివృద్ధి..

ఇన్‌చార్జ్ ఎంపీడీఓలుగా వ్యవహరిస్తున్న మండలాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందనే విమర్శలు ఉన్నాయి. పాలనపై కనీస అవగాహన లేకపోగా.. ఉపాధి నిధులు.. ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాల్లో భారీగా వాటాలు దండుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ అంశానికి సంబంధించి ఇప్పటికే జిల్లా పరిషత్ కార్యాలయానికి ఫిర్యాదులు కూడా అందాయి. కర్ణాటక సరిహద్దు మండలాల్లో పని చేసే ఒకరిద్దరు ఇన్‌చార్జ్ ఎంపీడీఓల తీరు మరీ వివాదస్పదంగా ఉన్నట్లు సమాచారం.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓలున్న మండలాలు

పేరు	హోదా	రెగ్యులర్ డ్యూటీ	ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాధ్యతలు
ఎం.నందకిషోర్	ఏఓ	బ్రహ్మసముద్రం	బ్రహ్మసముద్రం
జి.ఎస్.రామచంద్ర	ఎంపీడీఓ	కంబదూరు	కళ్యాణదుర్గం
ఇ.లక్ష్మీశంకర్	ఈఓఆర్డీ	కుందుర్పి	కుందుర్పి
కె.ఆజాద్	ఎంపీడీఓ	బొమ్మనహాళ్	డి.హీరేహాళ్
కె.రఘురామరావు	ఈఓఆర్డీ	శెట్టూరు	శెట్టూరు
బి.వి.రవిప్రసాద్	ఎంపీడీఓ	వజ్రకరూరు	ఉరవకొండ
ఎ.వి.రమణమూర్తి	ఏఓ	చిలమత్తూరు	చిలమత్తూరు
జి.అంజినప్ప	ఈఓఆర్డీ	నంబులపూలకుంట	నంబులపూలకుంట
డి.రామారావు	ఎంపీడీఓ	అమరాపురం	రొళ్ల
కె.రామానాయక్	ఏఓ	తలుపుల	తలుపుల
పి.రెడ్డెప్ప	ఏఓ	తనకల్లు	తనకల్లు
జి.గంగాధర్	ఏఓ	గుడిబండ	గుడిబండ
కె.ఓ.శ్రీధర్‌రావు	ఈఓఆర్డీ	పరిగి	పరిగి
ఎల్.రామ్‌కుమార్	ఏఓ	రొద్దం	రొద్దం
ఎ.జి.నటరాజ్	ఈఓఆర్డీ	కొత్తచెరువు	కొత్తచెరువు
డి.రాబర్ట్‌విల్సన్	ఎంపీడీఓ	ఓ.డి.చెరువు	నల్లమాడ
ఎస్.అనిల్‌కుమార్	ఈఓఆర్డీ	కనగానపల్లి	కనగానపల్లి
బి.వాసుదేవరెడ్డి	ఏఓ	యల్లనూరు	యల్లనూరు

కఠిన చర్యలు తప్పవు



ఉమ్మడి జిల్లాలో 18 మండలాలకు రెగ్యులర్ ఎంపీడీఓలు లేని మాట వాస్తవం. అక్కడ పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏఓలు, ఈఓఆర్డీలనే ఇన్‌చార్జ్‌లుగా నియమించాం. మరి కొన్ని చోట్ల రెండేసి మండలాలకు ఒకరికి అదనపు బాధ్యతలు అప్పగించాం. ఇదే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. రిక్రూట్‌మెంట్ జరిగితే రెగ్యులర్ ఎంపీడీఓలు వస్తారు. ఒకరిద్దరిపై ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయని మా దృష్టికి వచ్చింది. అలాంటి వారు పని తీరు మార్చుకోవాలి. లేకపోతే కఠిన చర్యలు తప్పవు.

– వెంకట సుబ్బయ్య, జెడ్పీ డిప్యూటీ సీఈఓ

విశ్రాంత ఉద్యోగులకు పీఎఫ్, గ్రాట్యుటీ చెల్లించాలి

ఓడీచెరువు: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు పీఎఫ్, గ్రాట్యుటీ వెంటనే చెల్లించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజమ్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నరసింహులు, నాయకులు సోమశేఖర్, వెంకటచలమయ్య, నాగరాజు తదితరులు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత ఏప్రెల్‌లో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు ఇప్పటి వరకూ పీఎఫ్, గ్రాట్యూటీ ఫండ్ చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అలాగే ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్న ప్రావిడెంట్ ఫండ్ రుణాలు, ఏపీజీఎల్ఐసీ రుణాలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.

పిల్లల పండుగకు సన్నాహాలు

అనంతపురం కల్చరల్: పిల్లల్లో నైతిక విలువలు, ఆత్మస్థైర్యం పెంచే విధంగా గత నాలుగేళ్లగా నిర్వహిస్తున్న పిల్లల పండుగను (బాలోత్సవ్) మరోసారి నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభించారు. ఈ మేరకు ఆదివారం రాత్రి స్థానిక లలిత కళాపరిషత్తులో 5వ బాలోత్సవ్ ఆహ్వాన కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్‌పర్సన్ షమీమ్ షఫీతో పాటూ నిర్వాహకులు ఐద్వా సావిత్రి, ఆర్డీటీ సంస్థ చైర్మన్ తిప్పేస్వామి, లలిత కళాపరిషత్తు కార్యదర్శి పద్మజ, సామాజిక సేవాకార్యకర్త రవికాంత్ రమణ, నాట్యాచార్యులు పట్నం శివప్రసాద్, పల్లవి, ఎస్టీయూ రమణారెడ్డి, యూటీఎఫ్ కోణేశ్వరప్ప, జిలాన్ బాషా, లింగమయ్య, మెడికల్ రెప్స్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు తదితరులు ఆహ్వాన కమిటీ సభ్యులు సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈ ఏడాది ప్రారంభంలో 160 పాఠశాలలు, 4 వేల మంది విద్యార్థులతో ఘనంగా బాలోత్సవాన్ని నిర్వహించామన్నారు. రానున్న కొత్త సంవత్సరం పిల్లల పండుగగా, మరచిపోలేని వేడుకగా చేయాలని తీర్మానించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకారమందించాలని కోరారు.

విలువలతో కూడిన విద్య అవసరం

అనంతపురం కల్చరల్: శాస్త్రీయ దృక్పథం కలిగిన సమాజాన్ని నిర్మించాలంటే విద్యార్థులకు చిన్ననాటి నుంచే విలువలతో కూడిన విద్య అందించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్, జేవీవీ గౌరవాధ్యక్షుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం జేవీవీ కార్యాలయంలో జనవిజ్ఞాన వేదిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యను కాషాయీకరించే ప్రయత్నం కొనసాగితే సమస్యలపై సరైన అవగాహన లేక రానున్న రోజుల్లో యువత చెడు మార్గంలో పయనిస్తారన్నారు. మూఢనమ్మకాలను ప్రోత్సహించే విద్య వద్దని సూచించారు. ఆచరణ సాధ్యమయ్యే జ్ఞానం అవసరమన్నారు. అంధ విశ్వాసాలను వ్యతిరేకించడానికి అందరూ భాధ్యత తీసుకోవాలని సూచించారు. అనంతరం జేవీవీ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు సాకే భాస్కర్, వెంకట్రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, గాంగేనాయక్, జిలాన్ బాషా, రామిరెడ్డి, తిరుపాలు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై నిర్లక్ష్యం వీడాలి

- ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి
- ఘనంగా ఎస్టీయూ 78వ వార్షికోత్సవం



మాట్లాడుతున్న మల్లు రఘునాథరెడ్డి

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా కూటమి సర్కార్ అంతులేని నిర్లక్ష్యం వహిస్తోందని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మండిపడ్డారు. పుట్టపర్తి మండలం బీడుపల్లి ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ 78వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్లు రఘునాథరెడ్డి హాజరై, మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్నా రాష్ట్రంలోని 11 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో అంతులేని నిర్లక్ష్యం కనబరుస్తోందన్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు ఆలస్యమవుతున్నందున పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.25 వేల కోట్ల బకాయిలను తక్షణమే మంజూరు చేయాలని, ఏకీకృత రూల్స్ సమస్యలను పరిష్కరించి పాఠశాల సహాయకులకు జూనియర్ లెక్చరర్‌లుగా పదోన్నతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల ఉపాధ్యాయులకు జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియాల మురళి, రామమోహన్ మాట్లాడుతూ.. ఈహెచ్‌ఎస్ కార్డులు పూర్తి స్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు ఎంటీఎస్ అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ... 1998, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని, దశల వారీగా రెగ్యులర్ చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉద్యోగ విరమణతో ఉన్నత పాఠశాలల్లో నెలకొన్న సబ్జెక్టు టీచర్ల కొరతను తీర్చాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులను తగ్గించాలని, ఎంఈఓ1, ఎంఈఓ2లకు సమాన అధికారాలు ఇవ్వాలని, పెన్షన్ సౌలభ్యాలను జాప్యం లేకుండా మంజూరు చేయాలని, వివిధ రకాల యాప్‌లను రద్దు చేయాలని కోరారు. పండుగలు, సెలవు దినాలను మినహాయించి పదో తరగతి యాక్షన్ ప్లాన్ నిర్వహించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ ఆర్థిక కార్యదర్శి గోపాల్‌నాయక్, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, సీనియర్ నాయకులు బీఎస్ ప్రసాద్, వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల శాఖ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



సన్మానం అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు

ఎస్టీయూ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన పలువురు ఉపాధ్యాయులను ఎస్టీయూ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సన్మానం అందుకున్న వారిలో చెన్నకృష్ణారెడ్డి, రవినాయక్, నఫీసా, నాగభూషణ, రామమూర్తి, కె.చంద్రశేఖర్, సుధాకర్, మహమ్మద్ ఇషాక్, ఎం చంద్రశేఖర్, బీలునాయక్, సరస్వతమ్మ, సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం ఉన్నారు.

ఆచూకీ తెలిస్తే చెప్పండి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

గుంతకల్లుటౌన్: స్థానిక రైల్వే డివిజన్ పరిధిలోని బేవినహాళ్ రైల్వే స్టేషన్‌లో ఆదివారం మధ్యాహ్నం గూడ్స్ రైలు కిందపడి ఓ గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. ఈ మేరకు జీఆర్పీ ఎస్‌ఐ మహేంద్ర వెల్లడించారు. 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మృతదేహం వద్ద ఆచూకీ తెలిపే ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 98661 44616కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

అగ్నిమాపక కేంద్రంలో ఎలుగుబంటి కలకలం

పావగడ: స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఓ ఎలుగుబంటి కలకలం రేపింది. శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో అగ్నిమాపక కేంద్రం ప్రహరీ దూకి లోపలకు చొరబడిన ఎలుగుబంటి ఆవరణ మొత్తం కలియదిరిగింది. సెక్యూరిటీ సిబ్బంది టార్చ్‌లైట్ వేసి కేకలు వేయడంతో తిరిగి ప్రహరీ దూకి పరుగు తీసింది. ఘటనతో క్వార్టర్స్‌లో ఉన్న ఉద్యోగుల కుటుంబసభ్యులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.

కేంద్ర సాహిత్య అకాడమీ కార్యక్రమాలు భేష్

అనంతపురం కల్చరల్: రాయలసీమ కథలు, నవలల్లో బహుజన జీవిత మూలాలు కనిపిస్తాయని ప్రముఖ విమర్శకుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో విమలా శాంతి సాహిత్య సాంస్కృతిక సేవా సమితి, కేంద్ర సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ సంయుక్త ఆధ్వర్యంలో 'రాయలసీమ సాహిత్యం-బహుజన జీవితం' అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రాచపాలెం మాట్లాడుతూ.. కేంద్ర సాహిత్య అకాడమీ సాహిత్య ప్రచారం కోసం నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. బహుజన వాదం మరింత రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సీనియర్ కథా రచయిత డాక్టర్ శాంతి నారాయణ మాట్లాడుతూ.. కేంద్ర సాహిత్య అకాడమీ నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంతో గొప్పవన్నారు. వీటిని ఉపయోగించుకుంటూ అనంత సాహితీ సంస్థలు మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే డాక్టర్ పొదిలి నాగరాజు రాయలసీమ నవల బహుజన జీవితంపై, డాక్టర్ భావికాటి రాఘవేంద్ర రాయలసీమ కథ బహుజన జీవితం అనే అంశంపై, రాయలసీమ సాహిత్యంలో బహుజన జీవితంపై డాక్టర్ అంకె శ్రీనివాస్, రాయలసీమ కవిత్వంలో బహుజన జీవితంపై కొత్తపల్లి సురేష్ ప్రసంగించారు.

ఏకీకృత మార్కెట్ విధానం రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

అనంతపురం అగ్రికల్చర్: కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ఏకీకృత మార్కెట్ విధానాన్ని తక్షణం రద్దు చేసుకోవాలని సీపీఎం అనుబంధ ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మార్కెట్ యార్డు ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్లు, సంతలను ప్రైవేట్‌పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. చిన్నపాటి సంతలపై కూడా ప్రధాని మోదీ ప్రభుత్వానికి కన్ను పడిందన్నారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాసేలా రైతులకు సేవలు అందకుండా చేస్తోందని ఆరోపించారు. సంతలు, మార్కెట్లను అగ్రిబిజినెస్ సెంటర్లుగా మారుస్తామని, జాతీయ ఏకీకృత మార్కెట్ విధానం పేరుతో రూపొందించిన ఫ్రేమ్‌వర్క్‌లో స్పష్టం చేసిన కేంద్రం మార్కెట్లను ఆదానీ, అంబాలనీలకు కట్టబెట్టడానికి కుట్ర చేస్తోందన్నారు. దీని వల్ల భవిష్యత్తులో రైతులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు నష్టం కలిగించే ఏకీకృత విధానం తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి, వన్నూరప్ప, రంగారెడ్డి, ఓబులేసు, మహానందరెడ్డి, నాగరాజు, శ్రీనివాసులు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కురుబ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఎంపిక



ఆర్వేటి పద్మావతి



ఎం.నాగరాజు

పెనుకొండ: ఉమ్మడి అనంతపురం జిల్లా కురుబ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం పెనుకొండలో ఎంపిక చేసారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కురుబ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలిగా ఆర్వేటి పద్మావతి (అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్), ప్రధాన కార్యదర్శిగా మంగళకుంట నాగరాజు (ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిని మంత్రి సవిత సన్మానించి, అభినందించారు.

'అపుస్మా' రాష్ట్ర కమిటీలో జిల్లాకు కీలక పదవులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులు కీలక పదవులు దక్కించుకున్నారు. ఆదివారం గుంటూరులో అపుస్మా రాష్ట్ర కమిటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్‌గా జిల్లా మాజీ అధ్యక్షుడు కుసుమ పుల్లారెడ్డి (అనంతపురం), రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాబు (కళ్యాణదుర్గం), లీగల్ అడ్వయిజర్‌గా కె.నాగార్జున (గుంతకల్లు)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా వాసులకు కీలక పదవులు దక్కడంపై జిల్లా అపుస్మా సభ్యులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు హర్షం వ్యక్తం చేశాయి.

పైన మొక్కజొన్న, టమాట.. లోపల గోమాంసం

- ఏపీ నుంచి బెంగళూరుకు రవాణా
- రూ.16లక్షల విలువైన 8 టన్నుల మాంసం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనం

గౌరిబిదనూరు: గో మాంసం రవాణా గుట్టు రట్టయ్యింది. ఏపీలోని శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నుంచి బెంగళూరుకు గోమాంసాన్ని రవాణా చేస్తుండగా మంచేనహళ్లి సమీపంలోని మిణకనగుర్కి గ్రామం వద్ద చిక్కబళ్లాపురం సైబర్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. బొలెరో, టెంపో వాహనాల్లో మొక్కజొన్న బెండ్లు, టమాటా మూటల ఉంచి వాటి కింద గోమాంసాన్ని రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. హిందూపురానికి చెందిన అరీఫ్, అసీంబాషా, బెంగళూరులోని శివాజీ నగరానికి చెందిన రెన్, నూరుల్లాషరీఫ్‌ను అరెస్ట్ చేసి రూ.16 లక్షల విలువైన 8 టన్నుల గోమాంసం, రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చిక్కబళ్లాపురం జిల్లా ఎస్పీ కుశాల్ చౌక్సే తెలిపారు. దాడిలో చిక్కబళ్లాపురం సైబర్ డీఎస్పీ రవికుమార్, సీఐ సూర్యకుమార్, ఎస్‌ఐ సరస్వతమ్మ పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

గుంతకల్లు టౌన్: బళ్లారి నుంచి గుంతకల్లుకు అక్రమంగా తరలిస్తున్న 960 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జి.శివసాగర్ తెలిపారు. ఆదివారం ఉదయం గుంతకల్లు శివారున బళ్లారి రోడ్డులోని ప్రార్థనా మందిరం వద్ద వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో మద్యం తరలిస్తూ బళ్లారి జిల్లా హగరి బొమ్మనహళ్లికి చెందిన క్యామన్న పట్టుపడినట్లు వివరించారు.

'అపూర్వ' సమ్మేళనం

రొద్దం: మండలంలోని పెద్దమంతూరులో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1991-92లో పదో తరగతి చదువుకున్న వారు 32 ఏళ్ల తర్వాత ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. నాడు కలసి చదువుకున్న దాదాపు 34 మందిలో 30 మంది తరలివచ్చారు. చిన్నప్పటి అల్లర్లను గుర్తు చేసుకుని మురిసి పోయారు. విద్యాబుద్ధులు చెప్పిన గురువులకు పాదాభివందనం చేసి ఘనంగా సత్కరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో సరస్వతీ విగ్రహానికి ప్రతిష్ఠాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుభాషిణి, పాఠశాల హెచ్‌ఎం ముజహర్ హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గురువులతో పూర్వ విద్యార్థులు